



హైదరాబాద్‌లో మాజీ సీఎం కేసీఆర్‌ను కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతున్న రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు కేక్ తినిపిస్తున్న వద్దిరాజు



# నాయకా.. వెయ్యేళ్లు వర్ధిల్లు..

- అంబరాన్నంటిన కేసీఆర్ జన్మదిన సంబురాలు
- ఉమ్మడి ఖమ్మం జిల్లావ్యాప్తంగా వేడుకలు
- కేక్‌లు కట్ చేసి మిఠాయిలు పంచుకున్న బీఆర్ఎస్ శ్రేణులు
- కేటీఆర్ పిలుపులో భాగంగా వృక్షార్చన
- రోగులకు పండ్లు పంపిణీ.. రక్తదాన శిబిరాల ఏర్పాటు
- జై కేసీఆర్.. జైజై కేసీఆర్ అంటూ మార్మోగిన నినాదాలు

" 'రైతుబంధు'వయ్యావు.. రైతుబీమాతో ధీమా అయ్యావు.. బీడుబారిన భూముల్లో జలసిరులు కురిపించావు.. చెరువుల మత్తడికి చిరునామా నీవు.. మొత్తానికి రైతును రాజును చేశావు. తరతరాల కరువును తరిమేశావు.. ఇంటింటికీ తాగునీరు అందించావు.. విరామం లేకుండా విద్యుత్ వెలుగులు విరజిమ్మావు.. వృద్ధులకు 'ఆసరా'గా నిలిచావు.. పేద కుటుంబాల్లో ఆడపిల్లల పెళ్లి కోసం 'కల్యాణలక్ష్మి' అందించి పెద్దన్న బాధ్యతను మోశావు.. సంక్షేమ ఫలాలను ప్రతి ఇంటికి చేర్చారు.. మీ ప్రతి ఆలోచనా అద్వితీయం.. ఆచరణ వినూత్నం.. అమలు విప్లవాత్మకం.. వెరసి మీ పదేళ్ల పాలన ఓ స్వర్ణయుగం అంటూ ప్రతి నోరూ కేసీఆర్‌ను కొనియాడింది. ఆయన జన్మదినం సందర్భంగా నాయకా.. వెయ్యేళ్లు వర్ధిల్లు అంటూ చేతులెత్తి దీవించారు. "

తెలంగాణ దివిటీ, ఉద్యమ కెరటం, రాష్ట్ర సాధకుడు, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు 70వ జన్మదిన సంబురాలు సోమవారం ఉమ్మడి ఖమ్మం జిల్లావ్యాప్తంగా అంబరాన్నంటాయి. బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు వాడవాడలా కేక్‌లు కట్ చేసి పటాకులు కాల్చారు. స్వీట్లు పంచారు. బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు వృక్షార్చన, సేవా కార్యక్రమాల్లో భాగంగా భారీఎత్తున మొక్కలు నాటారు. ఆసుపత్రుల్లో రోగులకు పండ్లు పంచారు. రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేశారు. అన్నదానాలు నిర్వహించారు. ఖమ్మం నగరంలోని మమత హాస్పిటల్ ఆవరణలో మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ కేక్ కట్ చేసి రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర హైదరాబాద్‌లోని లోటస్ పాండ్ పార్కులో మూడు మొక్కలు నాటారు. ఖమ్మం నగరంలోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయం(తెలంగాణ భవన్)లో పార్టీ జిల్లా అధ్యక్షుడు తాతా మధుసూదన్, మాజీ ఎమ్మెల్యేలు సండ్ర వెంకటవీరయ్య, కొండబాల కోటేశ్వరరావు కేక్ కట్ చేశారు. మొక్కలు నాటారు. కార్యాలయం మొత్తం గులాబీ రంగు బెలూన్లతో అలంకరించారు. కువైట్‌లో బీఆర్ఎస్ పార్టీ ఎన్నారై కువైట్ అధ్యక్షురాలు, ఖమ్మం జిల్లావాసి గొడిషాల అభిలాష ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. ఖమ్మంరూరల్ మండలం కస్నాతండాకు చెందిన రైతు మాలోతు భాస్కర్ తన మిర్చికల్లంలో ఎండుమిర్చితో హ్యాపీ బర్త్ డే కేసీఆర్ అని అక్షరాలుగా పేర్చి నాయకుల ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు పట్టణంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు కేక్ కట్ చేసి మొక్కలు నాటారు. పాల్వంచలోని పెద్దమ్మతల్లి ఆలయంలో కేసీఆర్ మళ్లీ సీఎం కావాలని కోరుతూ మాజీ మంత్రి వనమా వెంకటేశ్వరరావు దంపతులు పూజలు చేశారు. ఇల్లెందులో మాజీ ఎమ్మెల్యే హరిప్రియానాయక్, ఉద్యమ నేత దిండిగాల రాజేందర్ ఆధ్వర్యంలో 70 కిలోల కేక్ కట్ చేశారు. దమ్మపేటలో మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు, ఏన్కూరులో మాజీ ఎమ్మెల్యే బానోతు మదన్‌లాల్, మధిరలో జడ్పీ మాజీ చైర్మన్ లింగాల కమల్‌రాజు, కొత్తగూడెంలో జరిగిన వేడుకల్లో మున్సిపల్ మాజీ చైర్మపర్సన్ కాపు సీతాలక్ష్మి పాల్గొన్నారు.

*- ఖమ్మం (నమస్తే తెలంగాణ ప్రతినిధి)/భద్రాద్రి కొత్తగూడెం, ఫిబ్రవరి 17 (నమస్తే తెలంగాణ)*



ఖమ్మంలో కేక్ కట్ చేసి మాట్లాడుతున్న మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు పగడాల నాగరాజు, నాయకులు ఆర్జేసీ కృష్ణ, కూరాకుల నాగభూషణం



ఖమ్మంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో కేక్ కట్ చేస్తున్న పార్టీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్, మాజీ ఎమ్మెల్యేలు సండ్ర వెంకటవీరయ్య, కొండబాల కోటేశ్వరరావు తదితరులు



మణుగూరు బీఆర్ఎస్ కార్యాలయంలో కేక్ కట్ చేస్తున్న పార్టీ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు



దమ్మపేటలో కేక్ కట్ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు



పాల్వంచ పెద్దమ్మతల్లి ఆలయంలో మాజీ మంత్రి వనమా వెంకటేశ్వరరావు దంపతుల పూజలు



ఇల్లెందులో 70కిలోల భారీ కేక్‌ను కట్ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే బానోత్ హరిప్రియ, సీనియర్ నాయకుడు దిండిగాల రాజేందర్



మధిర బీఆర్ఎస్ కార్యాలయంలో కేక్ కట్ చేస్తున్న జడ్పీ మాజీ చైర్మన్ లింగాల కమల్‌రాజు



ఏన్కూరులో కేక్ కట్ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే బానోత్ మదన్‌లాల్




ఖమ్మంరూరల్ మండలం కస్నాతండాకు చెందిన రైతు మాలోత్ భాస్కర్ మిర్చికల్లంలో ఎండుమిర్చితో హ్యాపీ బర్త్ డే కేసీఆర్ అని అక్షరాలుగా పేర్చి అక్కడే జన్మదిన వేడుకలు జరుపుతున్న దృశ్యం



ఖమ్మం బీఆర్ఎస్ కార్యాలయంలో మొక్కలు నాటుతున్న పార్టీ శ్రేణులు



కొత్తగూడెం బీఆర్ఎస్ కార్యాలయంలో మొక్కలు నాటుతున్న మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మి



కువైట్‌లో బీఆర్ఎస్ పార్టీ ఎన్నారై కువైట్ అధ్యక్షురాలు, ఖమ్మం జిల్లా వాసి గొడిషాల అభిలాష ఆధ్వర్యంలో మొక్కలు నాటిన దృశ్యం

## వినతులు పెండింగ్‌లో ఉంచొద్దు


**ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్**



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

ఖమ్మం, ఫిబ్రవరి 17 : ప్రజావాణిలో స్వీకరించిన దరఖాస్తులను పరిశీలించి ఎప్పటికప్పుడు పరిష్కరించాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ పెండింగ్‌లో ఉంచొద్దని ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్, అదనపు కలెక్టర్ పి.శ్రీనివాసరెడ్డి, డీఆర్వో ఏ.పద్మశ్రీ, డీఆర్‌డీవో సన్యాసయ్యలతో కలిసి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బాధితులు సమర్పించిన ప్రతీ దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించాలని సూచించారు. ఖమ్మంలోని గ్లోరీ జీసస్ సోషల్ సర్వీస్ సొసైటీ వర్క్ అసోసియేషన్ డైరెక్టర్ డి.గంగయ్య, బోనకల్ మండలం రావినూతల గ్రామానికి చెందిన ఎం.సీత, తిరుమలాయపాలెం మండలం బచ్చోడు గ్రామానికి చెందిన బి.విజయ తదితరులు తమ సమస్యలపై అర్జీలు సమర్పించగా.. పరిష్కారం కోసం వాటిని ఆయా శాఖల అధికారులకు ఎండార్స్ చేశారు. కార్యక్రమంలో జిల్లా అధికారులు, కలెక్టరేట్ పరిపాలనాధికారి ఎన్.అరుణ తదితరులు పాల్గొన్నారు.

## ఇంటికొచ్చిన అల్లుడిని కాల్చేశారు.. చంపేశారు



గౌతమ్ (ఫైల్)

టేకులపల్లి, ఫిబ్రవరి 17: ఇంటికొచ్చిన అల్లుడిపై అతడి అత్త, మామ, బావమరుదులు కలిసి పెట్రోల్ పోసి నిప్పంటించారు. తీవ్రంగా గాయపడిన అతడు.. ఆస్పత్రిలో మృతిచెందాడు. బోడు ఎస్సై శ్రీకాంత్ తెలిపిన వివరాలు.. టేకులపల్లి మండలం రామచంద్రునిపేట గ్రామానికి చెందిన ఎజ్జు వెంకటేశ్వర్లు–అనురాధ దంపతుల కుమార్తె కావ్య, పాల్వంచ మండలం దంతాలబోరు గ్రామానికి చెందిన బల్లెం గౌతమ్(24) మూడేళ్ల క్రితం ప్రేమ వివాహం చేసుకున్నారు. గౌతమ్, సుజాతనగర్‌లో ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తున్నాడు. గౌతమ్–కావ్య దంపతులు అక్కడే నివాసముంటున్నారు. వీరికి ఇద్దరు ఆడ పిల్లలు. ఈ దంపతులు ఐదు నెలల క్రితం గొడవ పడ్డారు. అప్పటి నుంచి కావ్య, పిల్లలతో కలిసి తన పుట్టింటిలో ఉంటున్నది. వాళ్లను చూసేందుకని ఈ నెల 2న అత్తారింటికి అర్ధరాత్రి 12 గంటల సమయంలో గౌతమ్ వెళ్లాడు. అతడిని అత్త, మామ, బావమరుదులు అడ్డుకున్నారు. వారి మధ్య ఘర్షణ జరిగింది. తీవ్ర ఆవేశానికి లోనైన కావ్య తల్లిదండ్రులు, సోదరులు కలిసి గౌతమ్‌పై పెట్రోల్ పోసి నిప్పంటించి, ఇంట్లోకెళ్లి తలుపులు వేసుకున్నారు. మంటలు తాళలేని గౌతమ్, పక్కనే ఉన్న నీటి తొట్టిలోకి దూకాడు. అతడికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ విషయం తెలుసుకున్న (గౌతమ్) కుటుంబ సభ్యులు.. అతడిని కొత్తగూడెం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడి వైద్యుల సూచనతో ఖమ్మం ఆస్పత్రికి తీసుకెళ్లారు. పరిస్థితి విషమించడంతో మరింత మెరుగైన చికిత్స కోసం వరంగల్ ఎంజీఎంకు తరలించారు. అతడు అక్కడే చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతి చెందాడు. ఇతడు ఆస్పత్రిలో ఉన్నప్పుడే, తండ్రి బల్లెం వెంకటేశ్వర్లు ఈ నెల 11న బోడు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదైంది.

## అర్జీలను పరిశీలించి, పరిష్కరించండి

**భద్రాద్రి కలెక్టర్ జితేశ్ వి పాటిల్**



ప్రజావాణిలో వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ జితేశ్ వి పాటిల్

కొత్తగూడెం టౌన్, ఫిబ్రవరి 17 : తమ సమస్యలపై బాధితులు సమర్పించిన అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించి, త్వరితగతిన పరిష్కరించాలని భద్రాద్రి కలెక్టర్ జితేశ్ వి పాటిల్ సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. ఐడీవోసీ కార్యాలయ సమావేశ మందిరంలో అన్ని శాఖల అధికారులతో సోమవారం ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చి సమర్పించిన అర్జీలను స్వీకరించారు. తన పరిధిలోని దరఖాస్తులను పరిశీలించి, మిగిలిన అర్జీలను ఆయా శాఖల అధికారులకు పంపించారు.

**అదనపు కలెక్టర్ వార్నింగ్..**

భద్రాద్రి కొత్తగూడెం, ఫిబ్రవరి 17 (నమస్తే తెలంగాణ) : కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన ప్రజావాణి కార్యక్రమానికి ఉదయం 10 గంటలకు రావాల్సిన అధికారులు 11 గంటలు దాటినా రాకపోవడంతో అదనపు కలెక్టర్ వేణుగోపాల్ సీరియస్ అయ్యారు. ప్రజావాణి దరఖాస్తుల స్వీకరణ పూర్తయిన తర్వాత ఆయన అధికారులతో మాట్లాడారు. కలెక్టర్ ప్రజావాణికి వచ్చే ముందు ఎంత మంది అధికారులు వచ్చారని అడిగారన్నారు. ముందుగా మేము వస్తుంటే.. మీరు ఆలస్యంగా రావడం ఏమిటని అధికారులను అదనపు కలెక్టర్ ప్రశ్నించారు. జిల్లా అధికారులు తప్పనిసరిగా ప్రజావాణి కార్యక్రమానికి రావాలని, మొక్కుబడిగా వస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

## సమస్యల పరిష్కారంపై దృష్టి సారించండి

**గిరిజన దర్బార్‌లో ఐటీడీఏ పీవో రాహుల్**



గిరిజనుల నుంచి వినతులు స్వీకరిస్తున్న పీవో రాహుల్

భద్రాచలం, ఫిబ్రవరి 17 : గిరిజనులు తమ సమస్యలపై సమర్పించిన అర్జీల పరిష్కారంపై అధికారులు దృష్టి సారించాలని ఐటీడీఏ పీవో రాహుల్ ఆదేశించారు. భద్రాచలం ఐటీడీఏ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన గిరిజన దర్బార్‌లో గిరిజనుల నుంచి పీవో అర్జీలు స్వీకరించారు. తన పరిధిలో ఉన్న వాటిని పరిష్కరించి, మిగతా వాటిని సంబంధిత శాఖల అధికారులకు పంపించి పరిష్కరించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ పోడు భూములు, వ్యక్తిగత సమస్యలు, స్వయం ఉపాధి పథకాలకు రుణాలు, పట్టా భూములకు రైతుబంధు, జీవనోపాధి పెంపొందించేందుకు ఆర్థిక సాయం తదితర సమస్యలపై వినతులు వచ్చినట్లు తెలిపారు. వీటిని ఆన్‌లైన్ చేసి విడతలవారీగా ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించేందుకు కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఏపీవో జనరల్ డేవిడ్‌రాజ్, డీడీ మణెమ్మ, ఎస్‌డీసీ రవీంద్రనాథ్, ట్రైబల్ వెల్ఫేర్ ఈఈ చంద్రశేఖర్, ఏవో సున్నం రాంబాబు, ఎస్‌వో భాస్కరన్, ఏపీవో పవర్ వేణు, ఆర్‌వోఎఫ్ఆర్ డీటీ లక్ష్మీనారాయణ, డీఏస్‌వో ప్రభాకర్‌రావు పాల్గొన్నారు.

## తునికాకు ప్రూనింగ్ చేపట్టాలని ధర్నా

**టెండర్ల ప్రక్రియను పూర్తి చేయాలని పలు సంఘాల డిమాండ్**




భద్రాచలం ఎఫ్‌డీవో కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న గిరిజన, వ్యవసాయ కార్మిక సంఘాల నాయకులు

భద్రాచలం, ఫిబ్రవరి 17 : టెండర్ల ప్రక్రియను పూర్తి చేసి వెంటనే తునికాకు ప్రూనింగ్ పనులు చేపట్టాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం, ఆదివాసీ గిరిజన సంఘాల ఆధ్వర్యంలో భద్రాచలం డివిజన్ అటవీ శాఖ కార్యాలయం ఎదుట సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర నాయకుడు మచ్చా వెంకటేశ్వర్లు, గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి కారం పుల్లయ్య మాట్లాడుతూ వేసవి కాలంలో గిరిజనులకు ఉపాధి కల్పించే తునికాకు సేకరణ ప్రక్రియను ప్రారంభించడంలో రాష్ట్ర ప్రభుత్వం అలసత్వం ప్రదర్శిస్తున్నదని మండిపడ్డారు. దీనిపై అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ, రాష్ట్రస్థాయి అధికారులకు పలుమార్లు వినతిపత్రాలు సమర్పించినా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. టెండర్ల ప్రక్రియను ప్రారంభించకపోతే ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఏజెన్సీవ్యాప్తంగా ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. అనంతరం సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని ఎఫ్‌డీవో సుజాతకు అందజేశారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి రేపాక శ్రీనివాస్, జిల్లా ఉపాధ్యక్షులు గడ్డం స్వామి, మర్మం చంద్రయ్య, గిరిజన సంఘం బాధ్యులు రామ్మూర్తి, ఆదెయ్య, సుజాత, కార్మికులు పాల్గొన్నారు.